# కథ

## ఉదయశ్రీ

# తల్లి మనసు

"అన్నం అన్నం!"

"..."

"పూర్ణం ఓ పూర్ణం!"

"..."

"ఎందుకోయ్ అంతకోపం. నీ మాట రైటేనని ఒప్పుకున్నానుగా!"

"..."

"సరే! కడుపారా తొమ్మిది నెలలు మోసి కన్నావు. ప్రేమగా కంటికి రెప్పలా పెంచావు. నిజమే. కాని ఏ మాట కామాటే చెప్పుకోవాలి. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదంటావా? ఒక్క దానివే కుంతీ మాతలా..."

"చాల్లెండి !" కసిరింది అన్నపూర్ణ.

కొంటెగా ముసి ముసి నవ్వులు నవ్వాడు శంకరం.

"అదిగో! ఆ వెధవ నవ్వులే వద్దన్నాను. ఒళ్ళు మండిపోతుంది" రుసరుస లాడింది.

"శాంతం శాంతం! టాంకు బాగు చేస్తున్నారట, నీళ్ళు రావు ఇవాళ" మెల్లగా చెప్పాడు.

ఇంకేం మాట్లాడినా మెత్తబడినట్లుంటుందని విసురుగా లేచి వంటింట్లోకి వెళ్ళి కోపం అంతా సొరకాయ మీద చూపించింది.

వెంట వెళ్ళలేదు శంకరం. పైకి నవ్వుతూనే ఉన్నా అతనికి మనసులో దుగ్ధగానే ఉంది.

నిన్నగాక మొన్నటి సంగతిలా ఉంది.

నీను మోయలేక, మోయలేక, బ్యాగు బరువుకి ఒంగి, కళ్ళు నులుపుకుంటూ స్కూలు వేనులోకి ఒదిగి పిల్లలల మధ్య కూర్చుని వెనక్కి వెనక్కి చూస్తూ ఏడుపు బిగబట్టుకుంటూ వెళ్ళటం కళ్ళకు కట్టినట్లుంది.

ఎప్పుడు స్కూలు చదువు ముగిసి కాలేజీ కొచ్చాడో, ఉన్న ఊళ్ళో ఇంజనీరింగ్ కాలేజీలోనే సీటు దొరకటం అదృష్టమనే చెప్పాలి. వాళ్ళమ్మని విడిచి వెళ్ళే అవసరం లేకపోయింది.

లోలోపల గర్విస్తూనే పైకి పొంగకుండా, వాడికి ఏ సమయానికి ఏం కావాలో చక్కగా అమర్చిపెడుతూ నీడలా వెన్నంటి ఉండేది. వాడు పిక్నిక్ కెళ్ళాలన్నా, ఫ్రెండ్స్‌తో పార్టీకిగాని సినిమాకిగాని వెళ్ళాలంటే అమ్మ దగ్గర చేరేవాడు. ఈమె రాయబారం. తినేవరకు వదిలేదికాదు. వాళ్ళమ్మకొక ముద్దిచ్చి "బై మమ్మీ" తింటూ వెళ్ళేవాడు. చదువులో ఎన్నడూ అశ్రద్ధ చూపలేదు. అందుకే కేంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావటం, కంపెనీ వాళ్ళు మూడునెలలు తిరక్కుండానే అమెరికా పంపటం జరిగిపోయింది.

శరీరంలో సగభాగం పక్షవాతం వచ్చినట్లు అయిపోయింది అన్నపూర్ణ. అందరూ అదృష్టమని పొగుడుతుంటే తన బాధను దిగమింగి ఎలా పైకి నవ్వు పులుముకుందో తన ఒక్కదికే తెలుసు.

పిచ్చిది!

బిడ్డ భవిష్యత్తుకు అడ్డుపడకూడదని దుఃఖాన్ని కడుపులో దాచుకునే తల్లులు, కంఠంలో హాలాహలాన్ని దాచుకున్న ఆ పరమశివుని కంటే ఎందులో తక్కువ?

రెండేళ్ళుగా రాత్రులు కలత నిద్రే కాని కంటి నిండా నిద్రపోలేదు. టి.వి.లో, సినిమాల్లో తల్లీకొడుకుల్ని చూపిస్తున్నా కళ్ళనీళ్ళు పెట్టుకునేది.

పెళ్ళయ్యాక భర్తే ప్రాణంగా అనుకునేవాళ్ళు బిడ్డ పుట్టగానే పంచప్రాణాలు పిల్లలమీదే పెట్టుకుని, కోడి తన రెక్కలకింద పిల్లల్ని దాచుకున్నట్లు సకల సృష్టి నుండి రక్షిస్తూ, ఎవరి దృష్టి వారిమీద పడకుండా కాపాడుతూ పెంచుతారు. వారికి రెక్కలు రాగానే ఎగిరిపోతాయనే ప్రకృతి సూత్రాన్ని మర్చిపోతారు. దీన్ని స్వార్థం అందామా?

కాదు కాదు. మమకారపు తెర జీవిత న్యాయాన్ని కనుమరుగు పరుస్తుందేమో! కాని యువతరం ఈ అనుబంధాల్ని సంకెళ్ళుగా భావిస్తున్నారనిపిస్తుంది. బంధుత్వాలూ, భవబంధాలూ వాళ్ళకి అర్థం లేని ట్రాష్ అనిపిస్తుంది.

ఆఫీసులో నారాయణ సంగతి గుర్తుకువచ్చింది. హెడ్ క్లర్క్‌గా మంచిపేరు తెచ్చుకున్నాడు. ఎవర్నీ నొప్పించడు. పెద్దవారితో వినయంగా, జూనియర్లతో ప్రేమగా వ్యవహరిస్తూ గౌరవం సంపాదించుకున్నాడు. అతని భార్య హృద్రోగంతో పోతే ఆఫీసు స్టాఫ్ అంతా విచారించారు.

కష్టమో, నిష్ఠురమో భరించి కొడుకును ఎలక్ట్రానిక్స్ ఇంజనీరు చేశాడు. కుర్రాడు తెలివైనవాడు. వెంటనే ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. వాళ్ళేదో ప్రాజెక్ట్ వర్క్ కోసం ఆరునెలలో, ఏడాదో ఐర్లాండు పంపుతున్నారట.

తల్లి పోయిన దుఃఖంలో మతిలేనట్లుగా ఉన్న తండ్రిని వదిలిపోవటం ఎలాగ? అలాగని వచ్చిన ఛాన్స్ వదులుకోవటానికి సిద్ధంగా లేడు. తండ్రి అడ్డుగా ఉన్నట్లు ఫీలయిపోతున్నాడట. ధర్మసంకటం వచ్చింది ఆ కొడుకుకి. సంగతి ఇదీ అని తండ్రికి చెప్పకుండా స్నేహితుల దగ్గర గోడు వెళ్ళబోసుకున్నాడట. ఆ నోటా ఆ నోటా తెలిసింది నారాయణకు.

కొడుకును పిలిచాడు.

"బాబూ! రాలిపోయే ఆకులం మేము. మీరో క్రొత్త చిగుళ్ళు. పుష్పించి, ఫలించి వృద్ధిలోకి రావలసిన యువతరం మీది. డ్యూటీలో జాయిన్ అయ్యాక వాళ్ళేం చెబితే అది చేయాలి. కాని మన ఇంటి సమస్యలు అడ్డు కాకూడదు. నాకేం? నిక్షేపంగా ఉంటాను. వెళ్ళిరా! ఏడాది ఎంతలో గడుస్తుంది?" అని ప్రోత్సహించి పంపాడు.

ఆపైన నెలకే రిటైరయ్యాడు. ఇంట్లో ఒంటరితనం. పట్టించుకునేవాళ్ళు లేరు. తిన్నారా లేదా అని చూసే భార్య గతించింది. పిల్లలు ఏనాటికైనా దూరమయ్యేవాళ్ళే. కాని పెద్దతనంలోనే తోడుగా భార్యాభర్తలు ఒకరి అవసరం మరొకరికి ఎక్కువగా అనుభవంలో కొస్తుంది. పరస్పర అవగాహన పెరుగుతుంది.

ఎన్నేళ్ళు కలిసి జీవించినా, మృత్యువు ఎవరినో ఒకరినే ముందు తీసుకువెళ్తుంది కదా! ఇది చేదు నిజం! భరించక తప్పదు. రిటైరయిపోయినా రోజూ ఆఫీసుకొచ్చి వరండాలో రెండుగంటలు కూర్చుని వెళ్తాడు.

రేపు తనూ అంతేనా? నలభై ఏళ్ళు చేశాక కూడా ఎందుకీ తాపత్రయం? బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఇంక హాయిగా రిటైరయి, విశ్రాంతిగా అన్నపూర్ణకు తోడుగా ఇంట్లో ఉంటే, తన బాధ ఎంతో కొంత మర్చిపోతుందిగా! ఆఫీసులో తన స్థానం వేరొకరికి దక్కుతుంది.

చెల్లెలు సావిత్రి గుర్తుకు వచ్చింది. తనకంటే అయిదేళ్ళు చిన్న. వాళ్ళాయనకి రిటైరయిపోయినా, ఇంట్లో ఉండాలంటే చాలా కష్టమట. ఏమీ మాట్లాడదు. టీవీ చూడదు. బుక్స్ చాలా అరుదుగా చదువుతాడు. ఎక్కడికీ వెళ్ళడు. ఫ్రెండ్స్ కాలక్షేపం ఏమీ

లేదు. తిండికి, నిద్రకి మాత్రం ఇల్లు. మిగతా టైమంతా ఆఫీసు. దాని అదృష్టంకొద్దీ పిల్లలిద్దరూ బాగానే సెటిల్ అయ్యారు. కాని పెళ్ళి చేయాలంటే ఎందరు ఎన్ని సంబంధాలు తెచ్చినా ఊ అనడు. వాళ్ళు కోపగించుకుని మరి మాట్లాడలేదు. ఎంత కాలం ఇలా? పాపం! అది నెత్తీ నోరూ కొట్టుకుంటుంది. పిల్లలు మాత్రం ఎన్నాళ్ళు వెయిట్ చేస్తారు?

వంటింట్లో ఏదో భళ్ళుమంది.

పిచ్చిది! ఏం చేయాలో తెలీక విసుగును గిన్నెలమీద చూపిస్తుంది. నిట్టూర్చాడు.

తనకు మాత్రం బాధగా లేదూ?

ఈ పరిస్థితి భరించలేనట్లు, ఊపిరి ఆడనట్లుగా ఉంది. ఎలాగో ఒకలా ఇందులోంచి బయటపడాలని ఉంది.

సముద్రాల అవతల ఉన్నాడు. ఎలా ఉన్నాడో! మంచినీళ్ళు కూడా అందిస్తేనే తాగేవాడు. ఏం తింటున్నాడో అని అన్నపూర్ణ రోజూ తలచుకుంటుంది. ఉద్యోగస్థుడై, విదేశాల్లో ఉన్నా టైంకి తను పెడితే కాని తినటం రాని పసివాడనుకుంటుంది.

అమాయకురాలు! అలాంటిదానిని గుండెల మీద తన్నినట్లు ఫోను.

కాలేజీలో కలిసి చదివిన క్లాసుమేట్ అక్కడ కలిసిందట. ఇద్దరూ కలిసి తిరిగారు. ఆ పిల్ల లేనిదే ఉండలేను. పెళ్ళి చేసుకుంటాను మీ పర్మిషనుతో. దీవించండి అమ్మా అని ఫోను. నెత్తిమీద పిడుగు పడినట్లయింది ఆ తల్లికి. వాడు అక్కడ ఏడుపు. ఇది ఇక్కడ ఏడుపు. ఇరవై రెండేళ్ళు కంటికి రెప్పలా కాపాడుకున్నామే! రెండేళ్ళలోనే అది లేకపోతే ఉండలేనంటాడే! అన్నపూర్ణ గుండెకి తగిలిన గాయాన్ని తట్టుకోలేక విలవిల లాడింది.



పంచప్రాణాలు వాడిమీదే పెట్టుకుని పెంచింది.

ఇప్పుడు ఇంటింటా జరిగే కథ ఇదేనన్న సంగతి ఆమెకు తెలియదు.

"చిన్నప్పటి నుండి అడిగినవన్నీ ఇచ్చారు కదా అమ్మా! జీవితమంతా కలిసి బతకాల్సిన వ్యక్తిని, నాకు నచ్చినవాళ్ళను కాదంటారా?" అంటాడు.

కనిపించని బల్లేల లాంటి మాటలతో అన్నపూర్ణ హృదయాన్ని తూట్లు పొడిచేశాడు.

"కన్నాం! పెంచాం! అంటే అందరూ చేసే పనే కదా అమ్మా! ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా?" ఇదీ వాడి ప్రలాపం!

మనసులో రేగే తుఫానుకు నిశ్శబ్దంగా కారిపోయే కన్నీళ్ళే సాక్షి.

నెలరోజుల్లో సగానికి సగమైపోయింది.

తానెంత సమాధానపరచాలని చూసినా మాట్లాడదు. కంటిదృష్టి కూడా మందగించింది కన్నీళ్ళతో. ఎదురుగా ఉన్న భార్యనే సమాధానపరచలేకపోతే ఎక్కడో ఉన్న వాడితో ఫోనులో ఏం మాట్లాడగలం?

ఎలా అర్థం చేసుకుంటాడు ఆ తల్లికి వాడు ఎంత బాధ కలిగించాడో!


ఇప్పటి తరానికి వాళ్ళ జీవితం వాళ్ళ ఇష్టం!

అంతే తప్ప కన్నవాళ్ళ అభిప్రాయాన్ని గౌరవించటం అన్న మాటే వాళ్ళ బుర్రకి తోచదు.

మీ పర్మిషనుతో పెళ్ళి చేసుకుంటాను!

పర్మిషన్ ఇవ్వనంటే... మానేస్తారా?

రామారావు అన్నాడు. "ఇలాగే ఉంది శంకరం ఇవాళ పరిస్థితి. తీరా వాడు పెళ్ళి చేసుకుని వచ్చి గుమ్మంలో నిలబడతాడనుకో అప్పుడేం చేస్తావ్? పోరా వెధవా అనలేం కదా! తల్లిదండ్రుల మమకారాన్ని ఈ విధంగా కేష్ చేసుకుంటున్నారు పిల్లలు. "మా లైఫ్ మాది. కన్నంతలో మీ మాట వినాలన్న రూలేం లేదు. రేపు మా పిల్లలకైనా




## గడసరి దీపిక!

యువరాజ్‌సింగ్‌తో ప్రేమాయణం విషయమై తెగ పాపులర్ అవుతున్న దీపికా పదుకొనే మరీ ఎక్స్‌పోజింగ్ టైప్ పాత్రలకి నిర్మొహమాటంగా 'నో' చెప్పేస్తోందిట. అందుకు తాజా ఉదాహరణ హృతిక్ రోషన్ హీరోగా అనురాగ్ బసు అనే నిర్మాత తీసే సినిమాని ఆమె తిరస్కరించడమే. ఇందులో కాస్త ఎక్కువగానే ఎక్స్‌పోజింగ్ చేయాల్సి వుందిట. ఇలా చేస్తే యువరాజ్‌కి కోపం వస్తుందని దీపిక భావించబట్టే ఇలా నో చెప్పేసిందని బాలీవుడ్ సినీ జనాల ఉవాచ. కావచ్చు.

అంతే! వాళ్ళిష్టం వాళ్ళది. మేమేం అడ్డుపడం. అధికారం చలాయించం" అంటున్నారు. ఏదో రెండు అక్షింతలు నీ చేత్తో వేస్తే నీకు మర్యాద దక్కించుకున్నట్లు ఉంటుంది. ఆలోచించు" అని సలహా ఇచ్చాడు.

తనకూ నిజమే ననిపించింది.

కుమిలిపోతున్న అన్నపూర్ణని చూడలేదు. ఫోన్ మోగితే భయంగా చూస్తుంది. వాడిది ఒకటే పాట! "ప్లీజ్ అమ్మా! నాన్నగార్ని ఒప్పించు" ఏడుపు.

పిల్లలు ఎందుకిలా తయారౌతున్నారు?

ఒక్కరూ, ఇద్దరూ ఉండటంతో అతి గారాబం చేయటం వల్లనా? అడిగినవన్నీ కొని ఇవ్వటంతో ఇదే వీళ్ళ డ్యూటీ అని అనుకుంటున్నారా పిల్లలు?

పెద్దవాళ్ళ ముందు భార్యతో మాట్లాడటానికే సిగ్గుపడేవాళ్ళు తమ రోజుల్లో.

ఇప్పుడో! తల్లికి బై చెప్పి పెళ్ళాంతో షికార్లు. మొగుడు అనేవాడు షాపింగ్‌కీ, షికారుకీ తీసుకెళ్ళటానికే. అంతేకాని భర్తకు కావలసినవి వండి పెట్టాలనే స్పృహ ఉండటం లేదు. ప్రేమగా వండి వడ్డించటం టైం వేస్టు ఈ కాలం పిల్లల దృష్టిలో. వంటమనిషి పెట్టింది తినటం హోదా!

బయట హోటళ్ళలో తినటం స్టైలు!



అన్నపూర్ణ పాపం చుట్టాలు వస్తే ఏవేవో రకరకాలు చేయాలని చూస్తుంది. వంటింట్లోనే ఉంటుంది. పాతకాలం మనిషి అనే చెప్పాలి.

ప్రక్కింటి కొత్త దంపతులు ఎవరైనా వస్తే హోటల్‌కి వెళ్తారు. ట్రీట్ ఇవ్వటం అట. అదీ సుఖపడే పద్ధతి!

ఫోన్ మోగింది.

సుపుత్రుడే! ఇంకెవరు?

వంటింట్లోంచి గబగబా వచ్చింది.

కాని ఫోన్ ఎత్తకుండా, బేలగా నావైపు చూసింది. పాపం! అనిపించింది. ఇహ లాభంలేదు. ఈ టెన్షను భరించలేం! దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే! ఫోన్ అందుకున్నాడు.

"హలో!"

"..."

"ఊ! బాగానే ఉన్నాం! అమ్మా? ఎలా ఉంటుందనుకున్నావ్?" నీ ఘనకార్యానికి చాలా సంతోషిస్తుందన్నమాట పెదవి దాటనీయలేదు.

"ఎమోషనల్ బ్లాక్ మెయిలా? ఆ మాటకర్థం తెలుసా నీకు?"

అన్నపూర్ణ పైటకొంగు నోట్లో కుక్కుకుంది.

వాడు ఏడుపులోకి దిగాడు.

గంభీరంగా అన్నాడు.

"ఒకటి మాత్రం గుర్తుంచుకో. మా వయసులో సగం లేదు నీకు. నీ మీద ఆధారపడి మేము బ్రతకటం లేదు. మీ అమ్మ బాధ చూడలేక, నీతో కలిసి తిరిగిన ఆ పిల్లకి పెళ్ళి కాదేమోనన్న జాలితో ఈ పెళ్ళికి ఒప్పుకుంటున్నాను. కారెక్టరు అన్నది ఆడ, మగ, ఇద్దరికీ ముఖ్యమే. నువ్వేదో హీరోని అనుకోకు. ఎప్పుడు సెలవు దొరికితే అప్పుడు వచ్చి, అంటే వీలైనంత త్వరలో వస్తే, మా బాధ్యతగా రెండు అక్షింతలు నెత్తిన వేస్తాం" ఫోన్ కట్ చేశాడు.

అన్నపూర్ణ మొహం వాన వెలిసిన ఆకాశంలాగా ఉంది. కన్నీళ్ళతో తడిసిన మొహంలో ఏదో రిలీఫ్! టెన్షన్ తగ్గిన రిలీఫా? వైరాగ్యమా? వాడి బాధ తగ్గించటానికి తామే గుండెలపై రాయిలా దుఃఖాన్ని భరించటానికి సిద్ధపడిన తెగింపా? తన మొహం చూస్తే తల్లి గోదావరి గుర్తుకు వచ్చింది.

సుడిగుండాలనీ, చెత్తా చెదారాన్నీ గర్భంలో పెట్టుకుని పైకి శాంతంగా ప్రవహిస్తాయి నదులన్నీ. ప్రకృతికే కోపం వస్తే అంతా మునిగిపోతుంది.

సముద్ర గర్భంలో బడబాగ్ని. చీకటి కడుపున వెలుగు. పరస్పర విరుద్ధాలను సృష్టించిన దైవమే తల్లిని సృష్టించాడు. బిడ్డ ఎన్ని తప్పులు చేసినా క్షమించటమే కాని శపించటం తెలీని భూమాతకున్నంత ఓర్పు కన్నతల్లికి.

మనసులోనే జోహార్లర్పించాడు శంకరం.

★